


అసమ్మతి అనంతం

అర్బన్‌లో వైసీపీ అభ్యర్థికి సెగ

ప్రచారానికి దూరంగా కీలక నాయకులు

కత్తులు నూరుతున్న కార్పొరేటర్లు, మాజీలు

అనంతపురం క్రైం, మార్చి 27: వైసీపీలో అభ్యర్థులు ఖరారైనా అసమ్మతి సెగ మాత్రం తగ్గడం లేదు. అనంతపురం అర్బన్‌లోనూ పరిస్థితి అలాగే ఉంది. సిట్టింగ్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికే వైసీపీ అధిష్ఠానం టిక్కెట్ కేటాయించింది. ఆయన ప్రచారం ప్రారంభించారు. కానీ నియోజకవర్గంలో కీలక నేతలు ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. మాజీ ఎమ్మెల్యే మొదలు చోటా నాయకుల వరకు ఈ జాబితాలో ఉన్నారు. వారిని కలుపుకుని పోవాలని అనంత ప్రయత్నిస్తున్నా.. సానుకూల స్పందన రావడం లేదు. ఏప్రిల్ 18న అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడనుంది. ఆలోగా సర్దుబాటు చేసుకోవాలని అనంత ఆరాటపడుతున్నా.. అసమ్మతి నాయకులు సహకరించే సూచనలు కనిపించడం లేదు.

దీర్ఘకాల వైరం

అనంత వెంకటరామిరెడ్డికి అర్బన్‌లో దీర్ఘకాలంగా కొందరు నాయకులతో రాజకీయ వైరం కొనసాగుతోంది. మాజీ ఎమ్మెల్యే బి.నారాయణరెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కుటుంబానికి మధ్య కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పటి నుంచే ఆధిపత్యపోరు నడుస్తోంది. అనంత ఎంపీగానూ, బీఎన్ఆర్ ఎమ్మెల్యేగానూ పోటీ చేస్తున్నా.. దూరం మాత్రం తగ్గింది లేదు. వైసీపీ ఆవిర్భావం తరువాత కూడా ఆ దూరం కొనసాగుతోంది. బీఎన్ఆర్ సోదరులకు, అనంత వెంకటరామిరెడ్డికి మధ్య పొసగడం లేదు. పార్టీ ముఖ్య నాయకులు, సీఎం జగన్ వచ్చిన సందర్భాలలో మాత్రమే అనంత, మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి ఒకేచోట కనిపించారు. కొన్ని సందర్భాల్లో గురునాథరెడ్డి సోదరుడు ఎర్రిస్వామిరెడ్డి మాత్రమే వచ్చేవారు. ఒకే పార్టీలో ఉన్నా రెండు వర్గాలవారు అంటీముట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు.

- మైనార్టీ నాయకుడు నదీం అహ్మద్ వైసీపీ అధికారంలోకి రాకముందు అనంతపురం అర్బన్ నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్నారు. ఆ తరువాత మార్పు జరిగింది. టిక్కెట్ రాలేదని తేలిపోయింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా నామినేటెడ్ పదవి దక్కించుకున్నారు. ఎమ్మెల్యేకి ఆయన దూరంగానే ఉంటున్నారు.



విజయసాయిరెడ్డితో వైసీపీ నేతలు (ఫైల్)

- మాజీ మేయర్ రాగే పరశురాం గత ఎన్నికల్లో ఎమ్మెల్యే అనంతకు సన్నిహితంగా ఉన్నారు. నగరపాలిక ఎన్నికల్లో మేయర్ పదవి ఆశించారు. ఆయన భార్య నాగమణి కార్పొరేటర్‌గా ఉన్నారు. మేయర్ పదవి దక్కకపోవడంతో రాగే పరశురాంకు, ఎమ్మెల్యే అనంతకు దూరం పెరుగుతూ వచ్చింది. చివరకు ఎమ్మెల్యే ఇంటికి వెళ్లడమే మానేశారు.

మోహరించిన ద్వితీయ శ్రేణి

అర్బన్‌లో వైసీపీ అభ్యర్థి అనంతకు ద్వితీయ శ్రేణి నాయకుల నుంచి కాక తగులుతోంది. కొందరు కార్పొరేటర్లు, చోటామోటా నాయకులు ఆయన వైరివర్గంలో చాలామంది ఉన్నారు. కార్పొరేటర్లు మణికంఠారెడ్డి, నాగమణి, ప్రకాష్ రెడ్డి, బాబా ఫక్రుద్దీన్, మాజీ కౌన్సిలర్ జయరాం నాయుడు, ఆయన భార్య, కార్పొరేటర్ హరిత, రుద్రంపేట ఉప సర్పంచ్ నరేంద్రరెడ్డి అసమ్మతి రాగం వినిపిస్తున్నారు. రజక ఫెడరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, మాజీ కౌన్సిలర్ మునిశంకర్, వెంకట సుబ్బయ్య తదితరులు ప్రచారంలో పాల్గొనడంలేదు. కొందరు కార్పొరేటర్లు టీడీపీలోకి వెళతారనే ప్రచారం జరుగుతోంది.

మహాలక్ష్మీ దూరంగానే..



వైసీపీ అర్బన్ టిక్కెట్‌ను ఆ పార్టీ నాయకుడు మహాలక్ష్మి శ్రీనివాస్ ఆశించారు. 2019 ఎన్నికల్లో చివరి వరకు రేసులో నిలిచారు. టిక్కెట్ దక్కకపోవడంతో అసంతృప్తితోనే ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అనంతర పరిణామాల నేపథ్యంలో తొలిసారి కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. మేయర్ పదవి ఆశించారు. ఆ సమయంలో మైనార్టీలకే మేయర్ పీఠం అని ప్రకటించడంతో మరోసారి అసంతృప్తికి గురయ్యారు. డిప్యూటీ మేయర్ పదవికి నో చెప్పి, అహుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆ హోదాలో ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నా.. అనంత, మహాలక్ష్మి కలిసిపోయింది లేదు. వారి వర్గాల మధ్య వైరం కొనసాగుతోంది.

పాపం.. చవ్వా..




కాంగ్రెస్ పార్టీలో ఉండగా చవ్వా రాజశేఖర్‌రెడ్డి ఎన్నోమార్లు ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించారు. ప్రతిసారీ రేసులో ఉంటూ వచ్చారు. ఆ క్రమంలోనే అనంత వెంకటరామిరెడ్డితో వైరం ఏర్పడింది. వైసీపీ ఆవిర్భావం తరువాత కూడా చవ్వాకు అవకాశం దక్కలేదు. పలుమార్లు టిక్కెట్ కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. కార్పొరేటర్‌గా ఎన్నికై మేయర్ పదవి ఆశించినా ఫలితం దక్కలేదు. ఈ ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యే టికెట్ అడిగినా పార్టీ అధిష్ఠానం కనికరించలేదు. దీంతో చవ్వా సైతం అసమ్మతి వర్గంలో భాగమయ్యారు.

చాలామందే...



అనంత వెంకటరామిరెడ్డి వైరి వర్గం చాలానే ఉంది. రెండు వారాల క్రితం మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, కార్పొరేటర్ చవ్వారాజశేఖర్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, వైటీ శివారెడ్డి తదితరులు పార్టీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిశారు. తమలో ఒకరికి టిక్కెట్ ఇవ్వాలని అడిగారు. ఆ తరువాత కొన్ని రోజులకే ఎమ్మెల్యే అనంతకు టిక్కెట్ కేటాయించారు.



- అనంత వెంకటరామిరెడ్డిని వైసీపీ నాయకుడు వైటీ శివారెడ్డి మొదట్నుంచీ వ్యతిరేకిస్తున్నారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే టిక్కెట్ కోసం ప్రయత్నాలు సాగించారు. ఫలించకపోవడంతో నగరపాలిక ఎన్నికల బరిలో తన కుమారుడు మణికంఠారెడ్డిని బరిలో దింపి.. గెలిపించుకున్నారు. వైటీ కుటుంబం అనంత అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తోంది.



విజయ సాయిరెడ్డితో వైసీపీ నేతలు (ఫైల్)

నిన్ను ఓడిస్తాం..!

రాప్తాడు ఎమ్మెల్యేకి అసమ్మతి నాయకుల వార్నింగ్

కష్టకాలంలో పనిచేస్తే.. మోసగించారని మండిపాటు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ వ్యవసాయ మిషన్ మెంబర్ బోయ రాజారామ్

రాప్తాడు, మార్చి 27: 'పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు రాప్తాడు నియోజకవర్గంలో పని చేశాం. 2019లో నీ గెలుపు కోసం కృషి చేశాం. ఈ ఎన్నికల్లో నిన్ను మేమే ఓడిస్తాం' అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి వైసీపీ అసమ్మతి నాయకులు వైసీపీ నాయకులు వార్నింగ్ ఇచ్చారు. అనంతపురం నగరంలోని యాదవ కల్యాణ మండపంలో కనగానపల్లి మాజీ జడ్పీటీసీ బిల్లే ఈశ్వరయ్య అధ్యక్షతన బుధవారం సమావేశమయ్యారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులను గత ఎన్నికల్లో వాడుకుని గెలిచారని, ఆ తరువాత కష్టపడిన వారిని గాలికి వదిలేసి మోసం చేశారని బోయ రాజారాం అన్నారు. ఈ ఎన్నికల్లో ప్రకాశ్‌రెడ్డిని ఓడించడమే లక్ష్యంగా పని చేస్తామని అన్నారు. ఎమ్మెల్యే కుటుంబం వెంట ఉన్న బీసీ నాయకులు ఏ ఒక్కరూ బాగుపడలేదని, పదవులు కూడా రెడ్డి సామాజిక వర్గానికే ఇచ్చారని అన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ, సొంత పార్టీ కార్యకర్తలను నట్టేట ముంచారని ధ్వజమెత్తారు. 'నిన్ను నమ్మి గెలిపిస్తే అధికారంలోకి వచ్చాక మమ్మల్ని టార్గెట్ చేశావు. నిన్ను ఓడించడమే నా టార్గెట్' అని శపథం చేశారు. 'గతంలో నువ్వు రామగిరికి వెళ్లాలంటే బయపడేవాడివి. మా ఆడోళ్ల కొంగుల చాటున నిన్ను మేమంతా అక్కడికి ధైర్యంగా తీసుకెళ్లాం. అధికారంలోకి వచ్చాక గుంటూరోళ్ని తీసుకొచ్చి అనంతపురంలో తొడలు కొట్టిచ్చావు. నీ కోసం కష్టపడినోళ్లని అవమానించావు.' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019 ఎన్నికల్లో శంకర్‌నారాయణ, అనంత వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఉరవకొండ విశ్వేశ్వర్‌రెడ్డిని ఓడించేందుకు లోపాయికారి ఒప్పందం కుదుర్చుకోలేదా..? మంత్రి పదవి కోసం ఆనాడు ప్రయత్నించలేదా అని ప్రశ్నించారు. ప్రకాష్‌రెడ్డి వైఎస్ కుటుంబానికి విధేయుడు కాదని, ప్రకాష్‌రెడ్డిని పార్టీ నుంచి తొలగిస్తేనే రెడ్డి సామాజిక వర్గం కూడా బాగుపడుతుందని అన్నారు. ఈ విషయాన్ని జగన్ గమనించాలన్నారు.

- కష్టకాలంలో పని చేసిన వారిని తోపుదుర్తి కుటుంబం మోసగించిందని బిల్లే నరేంద్ర అన్నారు. తన అక్రమ సంపాదనకు అడ్డు వస్తారని పార్టీ కోసం పని చేసిన వారిని పక్కన పెట్టారని ఆరోపించారు. ఎన్నికల రావడంతో ఇప్పుడు తమ ఇళ్ల దగ్గరకు వస్తున్నారని విమర్శించారు. రాజ్య హింస అని పత్రికల్లో చదివేవాళ్లమని, ఇప్పుడు ప్రత్యక్షంగా రాప్తాడులో అనుభవిస్తున్నామని అన్నారు. ప్రకాష్‌రెడ్డీ పతనం ప్రారంభమైందని, తామందరం మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ నేతల్లో ఎవరైనా ఒకరిని ఎన్నికల్లో నిలబెట్టుకుంటామని అన్నారు.

- గత ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేసిన వారిని, డబ్బు ఖర్చు పెట్టిన వారిని ప్రకాష్‌రెడ్డి బాగా దెబ్బ కొట్టాడని, ఒక లీడర్‌ను ఓటరుగా మార్చిన ఘనత రాష్ట్రంలో ఒక్క ప్రకాష్‌రెడ్డికే దక్కుతుందని కనగానపల్లి మాజీ జడ్పీటీసీ బిల్లే ఈశ్వరయ్య మండిపడ్డారు. కష్టకాలంలో వైసీపీకి పని చేసి, కేసులు పెట్టించుకుని పోరాటం చేశామని, అధికారంలోకి వచ్చాక ప్రకాశ్‌రెడ్డి అంతకంటే ఎక్కువగా హింసించారని వాపోయారు. గతంలో ఓటు వేసిన వారే ప్రకాశ్‌రెడ్డిని ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సమావేశంలో వైసీపీ అసమ్మతి నాయకులు చంద్రాచార్ల న్యాయవాది హరి, రిటైర్డ్ జడ్జి కిష్టప్ప, నాగభూషణ, భానుగోట లక్ష్మీనారాయణ, కుంటిమద్ది ఆనంద్, తగరకుంట వినయ్, కొట్టాలపల్లి శ్రీరాములు, దాసరి ఆదినారాయణ, యలక్కుంట్ల నందమోహన్‌రెడ్డి, భానుకోట శివారెడ్డి, గాదికుంట పెద్దన్న తదితరులు పాల్గొన్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రకటనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఈ సమావేశంలో పాల్గొన్న ఐక్య కులాల వేదిక నాయకులు విమర్శించారు.



హాజరైన బీసీ, ఎస్సీ, ఎస్టీ శ్రేణులు

వైసీపీ అసమ్మతి నాయకుడి తోటకు నిప్పు

కాలి బూడిదైన డ్రిప్ పరికరాలు, కర్రలు



చిన్నజలాలపురంలో సరవకట్టెలు కాలిపోయిన దృశ్యం


శింగనమల, మార్చి 27: వైసీపీ అసమ్మతివర్గ నాయకుడు పట్నం నగేష్ తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో రూ.3 లక్షల నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. శింగనమల మండలంలోని చిన్నజలాలపురం గ్రామానికి చెందిన పట్నం నగేష్. తన తోటలో మామిడి, చీనీ, కాయగూరలను సాగు చేస్తున్నారు. నిప్పు పెట్టడంతో బిందు, తుంపర సేద్య పరికరాలు, పైపులు, బీర సాగు కోసం ఏర్పాటు చేసిన నాలుగు వేల సారవ కట్టెలు కాలి బూడిదయ్యాయి. తనను ఆర్థికంగా దెబ్బ తీయాలనే ఉద్దేశంతో వైరి వర్గంవారు ఈ పనిచేశారని బాధితుడు వాపోయాడు. వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులు, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి వ్యతిరేకంగా అసమ్మతి నాయకులు మంగళవారం నిర్వహించిన సమావేశానికి నగేష్ హాజరయ్యాడు. ఆ సమయంలోనే నిప్పు పెట్టారని బాధితుడు ఆరోపించాడు. విషయం తెలుసుకున్న వైసీపీ అసమ్మతి వర్గం నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి, మిద్దె కుళ్లాయప్ప, చాములూరు రాజుగోపాల్, నల్లపరెడ్డి చక్రాపాణిరెడ్డి తదితరులు నగేష్‌ను పరామర్శించారు. బాధితుడు ఫిర్యాదు చేయడంతో శింగనమల ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఉష్ణోగ్రతలు (బుధ)

గరిష్ఠం	40.0
కనిష్ఠం	24.0

నేడు ప్రజాగళం

టీడీపీ అధినేత చంద్రబాబు రాక



రాప్తాడు, బుక్కరాయసముద్రంలో బహిరంగ సభలు

పార్టీ శ్రేణులు, ప్రజల్లో చైతన్యం నింపనున్న బాబు

కూటమి విజయమే లక్ష్యంగా ప్రచార శంఖారావం

అనంతపురం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు జిల్లాలో సార్వత్రిక ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్నారు. ప్రజాగళం కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం జిల్లాకు వస్తున్నారు. రాప్తాడు, శింగనమల నియోజకవర్గాల్లో ప్రజాగళం బహిరంగ సభలను నిర్వహిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయమే లక్ష్యంగా ఆయన పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపనున్నారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి, వారిలో చైతన్యం నింపడమే ధ్యేయంగా జిల్లాకు వస్తున్నారు. రాప్తాడు, శింగనమల నియోజకవర్గాల్లో నిర్వహించే ప్రజాగళం బహిరంగ సభలకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు హాజరయ్యేలా పార్టీ అభ్యర్థులు, ముఖ్య నాయకులు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. రాప్తాడు నియోజకవర్గంలో మాజీ మంత్రి, ఆ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పరిటాల సునీత, ఆమె తనయుడు, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, నియోజకవర్గ నాయకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. శింగనమల నియోజకవర్గ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డితో పాటు ముఖ్య నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

పర్యటన ఇలా..

- మదనపల్లి నుంచి హెలిక్యాప్టర్‌లో ఉదయం 9.55 గంటలకు బయలుదేరి, 10.40 గంటలకు అనంతపురం శివారులోని అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- రాప్తాడు బస్టాండ్ సర్కిల్‌కు ఉదయం 11 గంటలకు చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో 12.30 గంటల వరకూ పాల్గొంటారు. ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.
- రాప్తాడు బస్టాండు దగ్గర నుంచి మధ్యాహ్నం 12.45 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి, ఒంటి గంటకు అనంతపురం నగర శివారులోని ఆర్డీటీ స్టేడియానికి చేరుకుంటారు.
- మధ్యాహ్నం ఒకటి నుంచి రెండు గంటల వరకూ భోజన విరామం.
- ఆర్డీటీ స్టేడియం నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి.. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ప్రజాగళం బహిరంగ సభ వద్దకు 2.20కి చేరుకుంటారు.
- మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ ప్రజాగళం బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.
- సాయంత్రం 4.15 గంటలకు బుక్కరాయసముద్రం నుంచి బయలుదేరి 4.30 గంటలకు నగర శివారులోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి కదిరి నియోజకవర్గ పర్యటనకు బయలుదేరుతారు.

సభకు తరలిరండి

- పరిటాల సునీత, శ్రీరామ్



హెలీ ప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

రాప్తాడు/బుక్కరాయసముద్రం, మార్చి 27: రాప్తాడులో గురువారం చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజాగళం సభకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలిరావాలని మాజీ మంత్రి పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు కోవెలమూడి రవీంద్ర, రవియాదవ్, రాజశేఖర్ తదితరులతో కలిసి సభా స్థలాన్ని వారు బుధవారం పరిశీలించారు. రాప్తాడు సభలో టీడీపీ సత్తా చాటాలని అన్నారు. చంద్రబాబు రాక సందర్భంగా టీడీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోందని అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఆ తరువాత రాంనగర్ అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలోని హెలీప్యాడ్‌ను పరిశీలించారు.

జయప్రదం చేయండి: బండారు శ్రావణి



బుక్కరాయసముద్రంలో నిర్వహించే ప్రజాగళం బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలిరా వాలని టీడీపీ శింగనమల నియోజకవర్గ అభ్యర్థి బండారు శ్రావణి పిలుపునిచ్చారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిర్వహించే సభలో ప్రజలనుద్దేశించి చంద్రబాబు ప్రసంగిస్తారని ఆమె తెలిపారు.



ఇఫ్తార్	గురువారం సాయంత్రం	06:33
సెహరీ	శుక్రవారం ఉదయం	05:01

సిద్ధం కండి: కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి 27: ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ గౌతమి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలు ఎన్నికల అవసరాలకు వినియోగించే వాహనాలు, లౌడ్ స్పీకర్లకు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని, దరఖాస్తులు వచ్చిన వెంటనే పరిశీలించి, నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వాలని సూచించారు. ఇంటి వద్దే ఓటు వేసేందుకు అర్హులైన 85 ఏళ్ల పైబడ్డవారు, దివ్యాంగుల వివరాలను సేకరించాలని సూచించారు. ఏప్రిల్ మొదటి వారంలో పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని, ఏప్రిల్ 12 నుంచి 15లోగా ఈవీఎంల తొలి ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. నియోజకవర్గాలలో తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌లును ఏర్పాటు చేసి, సీసీ కెమెరాలు అమర్చాలని సూచించారు.

నగదు సీజ్ చేస్తాం..

ఆధారాలు లేకుండా నగదు పట్టుబడితే సీజ్ చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు గౌతమి తెలిపారు. కోడ్ అమలులో ఉన్నపుడు రూ.50 వేలకు మించి ఏ ఒక్కరూ నగదు తీసుకువెళ్లరాదని అన్నారు. వ్యక్తిగత కారణాలతో అధిక మొత్తంలో నగదు తీసుకువెళ్లాల్సి వస్తే.. ఆ నగదు ఎక్కడిదో ఆధారాలు చూపాల్సి ఉంటుందని అన్నారు. ఆధారాలను చూపకపోతే, ఆ నగదును సీజ్ చేసి, రశీదు ఇస్తామని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే హెల్ప్ డెస్క్‌కు (నంబర్లు 08554-220009, 08554-232922) ఫోన్ చేయాలని సూచించారు.

వైసీపీ అభ్యర్థి ప్రచారంలో వలంటీర్


ప్రచారంలో వలంటీర్ సాయినాథ్‌రెడ్డి (వృత్తంలో)

నార్పల, మార్చి 27: మండలంలోని సిద్దరాచెర్ల గ్రామంలో బుధవారం వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో సిద్దరాచెర్ల గ్రామానికి చెందిన వలంటీర్ సాయినాథ్‌రెడ్డి పాల్గొన్నాడు. వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులుతో పాటు వలంటీర్ సాయినాథ్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశాడు.

వలంటీర్ తొలగింపు

ధర్మవరంరూరల్, మార్చి 27: రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి వస్తున్నారని, ఆ ప్రచారానికి ప్రజలు తప్పక హాజరుకావాలని కనగానపల్లి మండలం దాదులూరు పంచాయతీ కుర్లపల్లికి చెందిన మహేశ్వర్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆహ్వానించాడు. స్థానికులు పంచాయతీ అధికారులకు దీనిపై ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన అధికారులు వలంటీర్ మహేశ్వర్‌రెడ్డిని విధుల నుంచి తొలగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు

శింగనమల, మార్చి 27: మండలంలో లోలూరు వైసీపీ అభ్యర్థి వారాంజనేయులు మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ అంజన్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్లు ఆర్వో శ్రీను వెన్నెల బుధవారం తెలిపారు. ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే తమకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేయాలన్నారు.

షిఫ్ట్ ఆపరేటర్ తొలగింపు

డీ.హీరేహాళ్, మార్చి 27: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ప్రచారంలో పాల్గొన్న విద్యుత్‌శాఖలో షిఫ్ట్ ఆపరేటర్‌గా దాదాఖలందర్‌ను విధుల నుంచి తొలగించినట్లు విద్యుత్‌శాఖ ఏఈ లక్ష్మీరెడ్డి తెలిపారు. కొన్ని రోజులుగా రాయదుర్గం నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. విద్యుత్‌శాఖలో తాత్కాలిక షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించే దాదాఖలందర్ ప్రచారంలో పాల్గొన్నాడు. ఈ విషయమై పలు పత్రికల్లో ప్రచురితం అయ్యాయి. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై అధికారులు విచారించి, విధుల నుంచి తొలగించినట్లు అధికారులు తెలిపారు.

టెన్త్ సోషల్ పరీక్షకు 2,203 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మార్చి 27: జిల్లాలో పదో తరగతి సోషల్ పరీక్షకు మొత్తం 2,203 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. బుధవారం జిల్లాలో 142 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. రెగ్యులర్ విద్యార్థులు 31,330 మందికిగాను 31,018 మంది, ప్రైవేట్ విద్యార్థులు 2,538 మందికిగాను 647 మంది హాజరయ్యారు.

తోపు మాటలు నీటి మూటలు..!

- రాప్తాడు ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యం
- రోడ్ల నుంచి భవన నిర్మాణాల వరకు అంతే
- నిధులున్నా.. ఒత్తిళ్లతో ముందుకురాని కాంట్రాక్టర్లు
- హౌసింగ్‌లో చేతులేత్తేశాడు.. పీఆర్ పరంగా అదే దుస్థితి

ఎక్కడ చూసినా.... ఎప్పుడు సమావేశం పెట్టినా.. అది చేశాం.. ఇది చేశాం.. గత ప్రభుత్వాలు చేయనంతగా.. ఈ ఐదేళ్లలో మేమే పెద్దఎత్తున అభివృద్ధి చేశాం.. అంటూ రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి తోపు ప్రగల్భాలు పలుకుతారు. కానీ ఆ నియోజకవర్గంలోని క్షేత్ర స్థాయిలో ఈ ఐదేళ్లలో జరిగిన పని తీరు పరిశీలిస్తే.. ఆ ఎమ్మెల్యే చెప్పే మాటలకు.. చేతలకు ఏ మాత్రం పొంతన కనిపించదు. ఇటు పీఆర్ పనుల పరంగాను.. అటు హౌసింగ్ పనుల పరంగా.. ఎక్కడా చూసిన అంతే.. అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది.

- అనంతపురం సిటీ

రాప్తాడు నియోజకవర్గ పరిధిలో ఈ ఐదేళ్లలో పరిస్థితి ఇలా...

- మంజూరు చేసిన సచివాలయాలు : 47
- పూర్తి అయిన సచివాలయాలు : 31
- నిర్మాణ దశలో ఉన్నవి : 10
- పూర్తిగా ఆపేసినవి : 06
- మంజూరు చేసిన రైతు భరోసా కేంద్రాలు : 35
- పూర్తి అయిన రైతు భరోసా కేంద్రాలు : 28
- నిర్మాణ దశలో ఉన్నవి : 04
- పూర్తిగా ఆపేసినవి : 03
- మంజూరు చేసిన వైఎస్‌ఆర్ హెల్త్‌క్లీనిక్ భవనాలు : 35
- పూర్తి అయిన భవనాలు : 18
- నిర్మాణ దశలో ఉన్నవి : 08
- పూర్తిగా ఆపేసినవి : 09

రాప్తాడులో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు

- మంజూరైన సీసీ రోడ్ల సంఖ్య : 31
- ఇప్పటికి పూర్తి అయిన రోడ్ల సంఖ్య : 13
- నిర్మాణ దశలలో ఉన్న రోడ్ల సంఖ్య : 18
- రోడ్లకు కేంద్రం నిధుల మంజూరు : రూ. 1.56 కోట్లు.
- ఇప్పటి వరకు ఖర్చు చేసిన నిధులు : 50.00 లక్షలు మాత్రమే
- ఇంకా పనులు చేయాల్సిన నిధులు : రూ. 1.06 కోట్లు

హౌసింగ్ ఇళ్ల పరంగా...

- రాప్తాడు ఎమ్మెల్యేకు చెందిన రాక్రీట్ సంస్థ ఐదేళ్లలో కట్టించే ఇళ్ల సంఖ్య : 7,671
- ఈ ఐదేళ్లలో కట్టించిన ఇళ్ల సంఖ్య : 350 మాత్రమే
- ఇంకా కట్టాల్సిన ఇళ్ల సంఖ్య : 7,321

● రోడ్ల నుంచి భవనాల వరకు అంతే...

జిల్లాలోని రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల పరంగా ఎక్కడ చూసిన అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో జరగలేదు. ఇటు పంచాయతీ రాజ్‌శాఖ పరంగా జరిగే సీసీ రోడ్ల నుంచి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రామ వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్‌ఆర్ హెల్త్‌క్లీనిక్ భవనాల వరకు అభివృద్ధి పనులు ఏమాత్రం ఆశించిన స్థాయిలో జరగలేదు. కొన్ని చోట్ల మరీ దారుణం. పునాదులకే పరిమితమయ్యాయి. కొన్ని రోడ్ల నిర్మాణాలను మధ్యలోనే ఆపేశారు. ఇదిలా ఉండగా.. డిజటల్ లైబ్రరీల పరిస్థితి అయితే దయనీయంగా మారింది. రాప్తాడు నియోజకవర్గ పరిధిలో 59 డిజటల్ లైబ్రరీలు మంజూరు చేస్తే ఈ ఐదేళ్లలో ఒక్క దాన్ని కూడా నిర్మించలేదు.


ఆత్మకూరులో సీసీ రోడ్ల నిర్మాణ పనులు (ఫైల్)

ఎమ్మెల్యేకు చెందిన రాక్రీట్ సంస్థ చేపట్టిన జగనన్న లేఅవుట్ దుస్థితి



హౌసింగ్‌లోనూ చేతులెత్తేశాడు

వైసీపీ అధికారంలోకి రాగానే.. రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి తమ రాక్రీట్ సంస్థ ద్వారా ప్రభుత్వం అందించే రూ.1.80 లక్షలు, లబ్ధిదారులు చెల్లించే రూ.35 వేలు మొత్తంతో కలిపి జిల్లాలో 7,671 ఇళ్లను నిర్మించేలా ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆయితే ఈ ఐదేళ్లలో కేవలం 350 ఇళ్లను మాత్రమే కట్టించాడు. మిగిలిన 7,321 ఇళ్లు ఇప్పటికి నిర్మాణ దశలోనే ఉన్నాయి. వీటిలో 90 శాతం ఇళ్లు పునాదులకే పరిమితమయ్యాయి. ఇదే క్రమంలో నియోజకవర్గంలో పీఆర్ పనుల పరంగా సీసీ రోడ్లు, పలు ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులూ ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందాన్ని తలపిస్తున్నాయి.

● కమీషన్లు ఇవ్వలేక..

కేంద్ర ప్రభుత్వం గత ఏడాది సెప్టెంబరులో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద జిల్లాకు 360 సీసీ రోడ్లకు రూ. 17.60 కోట్లు నిధులను కేటాయించింది. వీటిలో రాప్తాడు నియోజకవర్గ పరిధిలో 31 రోడ్లకు సంబంధించి రూ.1.56 కోట్ల నిధులను కేటాయించింది. అయితే ఈ పనుల పరంగా ఎక్కడా ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించలేదు. ఇప్పటికి ఈ పనులకు నిధులు మంజూరు చేసిన ఏడు నెలలు గడిచిన 31 రోడ్లలో కేవలం 13 రోడ్లు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 18 రోడ్లు ఎప్పుడు పూర్తి అవుతాయో అర్థంకానీ దుస్థితి. పైగా ఈనెల 31వ తేదితో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఈ రోడ్లకు సంబంధించి అధికార పార్టీ వర్గీయుల నుంచి కమీషన్ ఇవ్వాలంటూ పలు రకాల ఒత్తిళ్లు రావడంతోనే.. నిధులున్నాప్పటికి చాలా మంది కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రావడం లేదని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. ఇదిలా ఉండగా... సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్‌ఆర్ హెల్త్‌క్లీనిక్‌ల పరంగా కూడా బిల్లుల జాప్యంతో పాటు కమీషన్ల ఒత్తిళ్లతో చాలా వరకు భవనాలు నిర్మాణాలు సాగలేదని తెలిసింది.

- నియోజవర్గానికి మంజూరైన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్ భవనాల సంఖ్య : 117
- పూర్తి అయిన భవనాల సంఖ్య : 77
- నిర్మాణ దశలో ఉన్న భవనాలు : 22
- పూర్తిగా ఆపేసినవి : 18
- రాప్తాడు పరిధిలో 59 డిజిటల్ లైబ్రరీలు మంజూరు చేస్తే.. ఒక్కటి కూడా నిర్మాణానికి నోచుకోలేదు.

ఆగేదెప్పుడు ?

- పెన్నా, చిత్రావతి నుంచి ఇసుక అక్రమ రవాణా
- మూన్నాళ్ల ముచ్చటగా పోలీసుల దాడులు
- టిప్పర్ల ధాటికి ఛిద్రమవుతున్న రహదారులు
- పలు గ్రామాల్లో అడ్డుకుంటున్న ప్రజలు
- నిద్రమత్తు వీడని అధికారులు

తాడిపత్రి టౌన్, మార్చి 27: ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల దాడులు మూన్నాళ్ల ముచ్చటగా మిగిలాయి. కొంతమంది అధికారుల అండతో ఇసుకాసురులు చెలరేగిపోతున్నారు. పెన్నానది ప్రాంతంలో హిటాచీలతో ఇసుకను తోడేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆపార్టీ నాయకులకు ప్రధాన ఆదాయ వనరుగా ఇసుక మారింది. తాడిపత్రి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు ప్రాంతాల్లో పెన్నా నది, శింగనమల నియోజకవర్గంలోని యల్లనూరులో చిత్రావతి నది ప్రవహిస్తున్నాయి. ఈ నదుల్లో ఇసుక నాణ్యతగా ఉండటంతో డిమాండ్ ఎక్కువగా ఉంది. దీంతో ఇసుకాసురులు రాత్రిపగలు తేడా లేకుండా ఇసుకను హిటాచీలతో తోడి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు తరలిస్తున్నారు. నదులలో ఇసుక తరిగిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి.

అడ్డుకుంటున్న ప్రజలు

ఇసుక అక్రమ రవాణాను అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో పలు గ్రామాల్లో ప్రజలే అడ్డుకుంటున్నారు. తాడిపత్రి మండలంలోని ఆలూరు వద్ద ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటామని టీడీపీకి చెందిన ఓ కీలకనేత, గ్రామస్థులు చెప్పడంతో కొన్నిరోజులు తాత్కాలికంగా అక్కడ తవ్వకాలు నిలిపివేశారు. అయితే రాత్రి సమయాల్లో పెద్దఎత్తున ఇసుకను తరలించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇసుక టిప్పర్ల అధిక టన్నేజీ వల్ల పలు గ్రామాల్లో రోడ్లు ఛిద్రం అవుతుండటంతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయంటూ గతంలో గ్రామస్థులు వాహనాలను అడ్డుకున్నారు. నెలరోజుల కిందట పుట్లూరులో మహిళలు ఇసుక టిప్పర్లను అడ్డుకున్నారు. యల్లనూరులో ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్లను గ్రామస్థులే అడ్డుకోవడం పరిపాటిగా మారింది. పదిరోజుల కిందట పెద్దవడుగూరు మండలం కొండూరు గ్రామంలో అక్రమంగా తరలుతున్న ఇసుక టిప్పర్లను గ్రామస్థులు అడ్డుకున్నారు.


ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్

అడ్డదిడ్డంగా ఇసుక అక్రమ రవాణా

అధికారుల నిఘా కొరవడటంతో నియోజకవర్గంలో వైసీపీ నాయకులు రెచ్చిపోయి అడ్డదిడ్డంగా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. తాడిపత్రి మండలంలోని గంగాదేవిపల్లి, చిన్నపొలమడ, వీరాపురం, సజ్జలదిన్నె, అక్కన్నపల్లి, ఆలూరు గ్రామాల వద్ద పెద్దఎత్తున టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇసుక రవాణా జరుగుతున్నా అటువైపు ఏ అధికారి కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పెద్దపప్పూరు సమీపంలో పెన్నానది నుంచి పెద్దఎత్తున ఇసుక తరలింపు జరుగుతోంది. దీంతో నదిలో భారీగా గోతులు ఏర్పడ్డాయి. పెద్దవడుగూరు మండలంలోని చిట్టూరు, చిత్రచేడు, కొండూరు, నాగలాపురం నదీపరివాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమంగా తరలుతున్నా కట్టడిచేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. పెద్దవడుగూరు నుంచి నంద్యాలజిల్లాకు ఇసుకను తరలించాలంటే యాడికి మండలంలోని రాయలచెరువు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. కానీ యాడికి పోలీసులు దాడులు నిర్వహించి టిప్పర్లు, ట్రాక్టర్లను సీజ్ చేసిన సంఘటనలు చాలా తక్కువగా ఉన్నాయి. పెద్దపప్పూరుతోపాటు గార్లదిన్నె, పసలూరు, నరసాపురం గ్రామాల్లోని నదీపరివాహక ప్రాంతాలను ఇసుకా సురులు టార్గెట్‌గా పెట్టుకొని టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా పెద్దఎత్తున అక్రమ రవాణా చేస్తున్నారు. శింగనమల నియోజకవర్గంలోని యల్లనూరు మండలంలోని మేడికుర్తి, తిరుమలాపురం చిత్రావతి నది నుంచి పెద్దఎత్తున ఇసుక తవ్వేస్తున్నారు.


ఆలూరు గ్రామ సమీపంలోని నదిలో యంత్రంతో ఇసుకను తోడుతున్న దృశ్యం (ఫైల్)

పత్తాలేని మైన్స్ అండ్ జియాలజీ అధికారులు

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన మైన్స్ అండ్ జియాలజీ అధికారులు పత్తా లేకుండా పోయారు. ఇసుక తవ్వకాలు చేయకూడదంటూ కోర్టు ఆదేశాలు ఇచ్చినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇక పోలీసులైతే తమకు ఎన్నికల విధులు ఉన్నాయంటూ నామమాత్రపు దాడులతో చేతులు దులుపుకుంటున్నారు. ఇరుశాఖల అధికారుల దాడులు లేకపోవడంతో ఇసుకాసురులు యథేచ్ఛగా ఇసుకను తరలించేస్తున్నారు.


పెద్దవడుగూరు మండలం కొండూరు గ్రామంలో ఇసుక టిప్పర్‌ను అడ్డుకుంటున్న గ్రామస్థులు (ఫైల్)

30 నుంచి దివ్యాంగ పిల్లలకు అసెస్‌మెంట్ క్యాంప్

కొత్తచెరువు, మార్చి 27: శ్రీసత్యసాయి జిల్లాలోని ఏపీ సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాలలోని దివ్యాంగ పిల్లలకు అసెస్‌మెంట్ క్యాంప్‌లను ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు డీఈఓ మీనాక్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30న ధర్మవరంలోని ఎల్‌సీకే పురంలో గల భవిత కేంద్రంలో నిర్వహించే క్యాంపులో ధర్మవరంతో పాటు బత్తలపల్లి, తాడిమర్రి, రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాలకు చెందిన దివ్యాంగ పిల్లలు హాజరు కావాలన్నారు. ఏప్రిల్ 1న కదిరి భవిత కేంద్రంలో నిర్వహించే క్యాంప్‌నకు కదిరితోపాటు ఓడీసీ, ఎన్‌పీకుంట, నల్లచెరువు, గాండ్లపెంట, తనకల్లు, తలుపుల, అమడగూరు మండలాలకు చెందిన దివ్యాంగపిల్లలు హాజరు కావాలన్నారు. ఏప్రిల్ 2న హిందూపురంలోని భవిత కేంద్రంలో నిర్వహించే క్యాంప్‌నకు లేపాక్షి, చిలమత్తూరు, పెనుకొండ, సోమందేపల్లి, పరిగి మండలాల దివ్యాంగ పిల్లలు హాజరుకావాలన్నారు. 3న మడకశిరలోని భవిత కేంద్రంలో నిర్వహించే క్యాంపునకు అగళి, రొళ్ల, గుడిబండ, అమరాపురం, రొద్దం మండలం పిల్లలు హాజరు కావాలన్నారు. 4న పుట్టపర్తిలోని భవిత కేంద్రంలో నిర్వహించే క్యాంప్‌నకు గోరంట్ల, బుక్కపట్నం, కొత్తచెరువు, నల్లమాడ, పుట్టపర్తి, ముదిగుబ్బ మండలాలకు చెందిన దివ్యాంగ పిల్లలు హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

3 నుంచి పింఛన్ల పంపిణీ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 27: ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా ఏప్రిల్ నెలకు సంబంధించి పింఛన్ పంపిణీ మూడు రోజులు ఆలస్యం పంపిణీ చేస్తున్నట్లు డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నరసింహారెడ్డి తెలిపారు. మార్చి 31, ఏప్రిల్ 1వ తేదీన బ్యాంకులు పనిచేయని కారణంగా... ఏప్రిల్ 1న పంపిణీ చేయాల్సిన సామాజిక భద్రత పింఛన్లు మూడో తేదీ నుంచి పంపిణీ చేస్తామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామ-వార్డు వలంటీర్లు పింఛన్ పంపిణీలో ఎటువంటి ప్రచారం, ఫొటోల ప్రదర్శన, ఆర్భాటాలు చేయరాదని సూచించారు. పింఛన్ పంపిణీలో ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తచెరువు, మార్చి 27: 2024-25వ విద్యా సంవత్సరానికి గాను శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్న 10 ఆదర్శపాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఈఓ మీనాక్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో చదివి 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో https://apms. apcfs s.inతో పాటు https://cse.ap.gov.in వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే వారు ఈనెల 25 నుంచి మే 22వతేదీ వరకు నెట్‌బ్యాంకింగ్,క్రెడిట్,డెబిట్ కార్డులు ఉపయోగించి గేట్ వే ద్వారా అప్లికేషన్ రుసుం చెల్లించాలన్నారు. ఆ తరువాత వారికి ఒక జనరల్ నెంబర్ కేటాయిస్తామన్నారు. ఆ నెంబరు ఆధారంగా వెబ్‌సైట్‌లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓసీ, బీసీ ఈడబ్ల్యూఎస్‌లకు రూ.200, ఎస్సీ,ఎస్టీలకు రూ.150 రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. 10వతరగతిలో మెరిట్ ఆధారంగా, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం ఆదర్శపాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉప విద్యాశాఖ అధికారులను, మండల విద్యాశాఖ అధికారులను సంప్రదించాలని డీఈఓ సూచించారు.

రేపు రాయలసీమ చిత్రలేఖనాల ప్రదర్శన

అనంతపురం కల్చరల్, మార్చి 27: రాయలసీమ ప్రాంత సంస్కృతి, సమాజ స్థితిగతులపై ఇటీవల నిర్వహించిన పోటీలకు వచ్చిన చిత్రలేఖనాలను శుక్రవారం ఉదయం 9 గంటలకు ఎస్‌ఎస్‌బీఎన్ కళాశాలలోని వేమన ఫౌండేషన్ కేంద్రంలో ప్రదర్శించనున్నారు. ఈమేరకు వేమన ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రదర్శనలో దాదాపు వందకు పైగా చిత్రలేఖనాలను ప్రదర్శిస్తామన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

అనంతపురం సెంట్రల్, మార్చి 27: పాలిసెట్‌కు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 4న జరిగే పాలిసెట్ పరీక్షలకు జిల్లాలోని అనంతపురం, రాయదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి, నార్పల, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తరగతులు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 94905 41633, 95029 76961 ఫోన్ నెంబర్లకు గాని, సమీప ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను గాని సంప్రదించాలని సూచించారు.

అంజలి మృతి కేసులో ముగ్గురి అరెస్టు

భర్త తీవ్రంగా కొట్టడంతోనే మృతి: డీఎస్పీ

అనంతపురం క్రైం, మార్చి 27: గర్భిణి అంజలి అనుమానాస్పద మృతి కేసులో ఆమె భర్త రాజు, బేల్దారులు దస్తగిరి, బాలుని వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. కేసు వివరాలను వన్‌టౌన్ సీఐ రెడ్డప్పతో కలిసి డీఎస్పీ వీరరాఘవరెడ్డి వెల్లడించారు. అంజలి మృతి కేసును సీరియస్‌గా తీసుకున్నామని, ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి అంజలి బిడ్డలను, అత్త తులశమ్మను విచారించామని తెలిపారు. ఈ నెల 23న అంజలిని బాలు, దస్తగిరి ఇంటి నుంచి ఆటోలో తీసుకెళ్లారని, కొన్ని గంటల తరువాత ఇంట్లో వదిలివెళ్లారని తెలిపారు. ఈ విషయంలో అంజలి, ఆమె భర్త రాజు మధ్య ఆ రాత్రి గొడవ జరిగిందని, ఎక్కడెక్కడో తిరుగుతూ పిల్లలను పట్టించుకోవడం లేదని భార్యను రాజు నిలదీశాడని తెలిపారు. దీంతో నిత్యం మద్యం తాగుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నావని అంజలి ఎదురు తిరిగిందని, ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ తీవ్రమై.. అంజలిని భర్త తీవ్రంగా కొట్టాడని తెలిపారు. భర్త కొట్టడంతో ఆమెకు గాయాలైనట్లు ప్రాథమిక విచారణలో తేలిందని, ఆ తరువాత కొంతసేపటికి అంజలి మృతి చెందిందని వివరించారు. అంజలి ఆర్థిక పరిస్థితిని ఆసరాగా చేసుకుని, ఆమెను బేల్దార్లు దస్తగిరి, బాలు నమ్మించి శారీరకంగా వాడుకున్నారని తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని డీఎస్పీ తెలిపారు. మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ శివరామిరెడ్డి సమక్షంలో ఫోరెన్సిక్ ప్రొఫెసర్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో మహిళా వైద్యుల బృందం ఖననం చేసిన అంజలి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించిందని, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి

వివాహేతర సంబంధంతోనే హత్య

- శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవ రెడ్డి
- అమరనాథ్ రెడ్డి హత్య కేసులో నలుగురి అరెస్టు

పుట్టపర్తి రూరల్, మార్చి 27: నల్లమాడ మండలం కుటాలపల్లి గ్రామానికి చెందిన అమరనాథ్‌రెడ్డి హత్యకు వివాహేతర సంబంధమే కారణమని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి తెలిపారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీ వాసుదేవన్‌తో కలిసి బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఎస్పీ తెలిపిన మేరకు, కుటాలపల్లికి చెందిన దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి కుటాలపల్లి తండాకి చెందిన రమావత్ తిప్పేబాయితో పదిహేనేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. మూడు నెలల నుంచి దుద్దుకుంట అమరనాథ్‌రెడ్డి కూడా అదే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో దుద్దుకుంట శ్రీనివాసరెడ్డిని తిప్పేబాయి దూరం పెట్టింది. అమరనాథ్‌రెడ్డి తన కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం చేశాడని, ప్రతినెలా తన అవసరాలు తీరుస్తున్నాడని శ్రీనివాసరెడ్డితో చెప్పింది. అమరనాథ్ రెడ్డిని వదిలేయాలంటే అతనికి రూ.లక్ష ఇచ్చేయాలని సూచించింది. తన ఆర్థిక పరిస్థితి బాగాలేదని, డబ్బులు ఇవ్వలేనని శ్రీనివాసరెడ్డి ఆమెతో అన్నాడు. అట్లయితే అమరనాథ్ రెడ్డిని చంపేయాలని, అప్పుడు కలిసి ఉండొచ్చని తిప్పేబాయి చెప్పడంతో శ్రీనివాసరెడ్డి సమ్మతించాడు. తన బంధువు గుండ్ర వీరారెడ్డి, చౌటకుంటపల్లి గ్రామానికి చెందిన మల్లెల వినోద్‌కుమార్ అలియాస్ కర్ల సాయంతో అమరనాథ్ రెడ్డిని చంపాలని పథకం వేసుకున్నాడు. ఈ నెల 24వ తేదీన నల్లమాడలో ఇద్దరికీ మద్యం తాపించి, తన బైక్‌పై అమరనాథ్ రెడ్డి పొలం వద్దకు వెళ్లారు. అక్కడ నిద్రిస్తున్న అమరనాథ్ రెడ్డిని తమతో తీసుకెళ్ళిన మల్బరీ ఆకు కత్తిరించే కత్తితో విచక్షణారహితంగా నరికి చంపారు. ఈ కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని, బైకును స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. హత్య కేసును ఛేదించిన పుట్టపర్తి డీఎస్పీ నేతృత్వంలోని నల్లమాడ సీఐ రాజేంద్రనాథయాదవ్, పుట్టపర్తి రూరల్ సీఐ రాగిరిరామయ్య, సోసియల్ మీడియా ఇన్స్‌పెక్టర్ హేమంత్‌కుమార్, నల్లమాడ ఎస్ఐ రమేష్‌బాబు బృందాన్ని ఆయన అభినందించారు.


హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ మాధవ రెడ్డి

ఇది ఆర్టీసీ పరీక్ష ..!

- ముగిసిన టెన్త్ పరీక్షలు
- కిక్కిరిసిన ఆర్టీసీ బస్టాండ్లు
- సీఎం సేవలో ఆర్టీసీ అధికారులు
- మొత్తం 190 బస్సుల కేటాయింపు
- ఇబ్బందులు పడ్డ విద్యార్థులు, ప్రయాణికులు

అనంతపురం కల్చరల్, మార్చి 27: టెన్త్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. సొంతూరిలో సరదాగా గడపడం ఎపుడెప్పుడా అని ఎదురుచూసిన విద్యార్థులు తమ తల్లిదండ్రులు, బంధుమిత్రులతో బస్టాండ్ చేరుకున్నారు. దీంతో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కిటకిటలాడింది. విద్యార్థులు, ప్రయాణికులతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోయాయి. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో బస్సులు తక్కువగా ఉండడంతో నిరీక్షణ తప్పలేదు. ఉన్న బస్సుల్లోనే ప్రయాణికులు సీట్ల కోసం పాట్లు పడుతూ సొంతూరు వెళ్లారు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

సీఎం సేవలో ఆర్టీసీ అధికారులు...

అనంత ఆర్టీసీ అధికారులు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సేవలో తరించిపోతున్నారు. అనంతపురం రీజియన్ వ్యాప్తంగా మొత్తం 494 బస్సు సర్వీసులున్నాయి. బుధవారం ప్రొద్దుటూరులో జరిగిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సభ నేపథ్యంలో రీజియన్ వ్యాప్తంగా దాదాపు సగం ఆర్టీసీ బస్సులను ఆ సభకు కేటాయించి స్వామిభక్తిని చాటుకున్నారు. జిల్లాలో అనంతపురం డిపో నుంచి 32, గుంతకల్లు డిపో 26, ఉరవకొండ డిపో 23, గుత్తి డిపో 10, రాయదుర్గం డిపో 32, తాడిపత్రి డిపో 35, కళ్యాణదుర్గం డిపో నుంచి 32 బస్సులు చొప్పున మొత్తం 190 బస్సులను సీఎం సభకు జనాన్ని తరలించేందుకు కేటాయించారు. అసలే పదోతరగతి పరీక్షలు ముగియడంతో బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అయినా ప్రయాణికుల సౌకర్యాన్ని గాలికొదిలేసిన ఆర్టీసీ అధికారులు... సీఎం కార్యక్రమానికి బస్సులను తరలించడంపై ప్రయాణికులు అసహనాన్ని వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా బస్సుల తరలింపులో ఆర్టీసీ అధికారులు మరో అడుగు ముందుకు వేసి, బుధవారం సీఎం కార్యక్రమానికి తరలించిన ఆర్టీసీ బస్సులు ప్రొద్దుటూరులో మూడు రోజులు, తర్వాత వెంటనే నంద్యాలలో మరో రెండు రోజులు జనాన్ని తరలించేలా డ్రైవర్లకు ఆదేశాలిచ్చినట్లు సమాచారం. మొత్తంగా వరుసగా ఐదురోజుల పాటు రీజియన్ వ్యాప్తంగా ప్రయాణికులకు కష్టాలు తప్పేలా లేవు.



సీఎం సభకు బస్సులు తరలించడంతో.. బస్సుల్లేక బస్టాండులో ప్రయాణికుల పడిగాపులు





బస్సులో సీట్ల కోసం ప్రయాణికులు, విద్యార్థుల పాట్లు



ప్రజాగళం సభను జయప్రదం చేద్దాం

అనంతపురం అర్బన్, మార్చి 27 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రజాగళం పేరుతో చేపట్టిన ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గురువారం రాప్తాడు, శింగనమల, కదిరి నియోజకవర్గాల్లో జరిగే ప్రజాగళం కార్యక్రమాలకు తెలుగు యువత నాయకులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

చెన్నేకొత్తపల్లి : రాప్తాడులో గురువారం నిర్వహించే ప్రజాగళం సభను విజయవంతం చేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్‌నారాయణచౌదరి, మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడారు. మండలవ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పరిటాల అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు కోరారు.

గార్లదిన్నె: బుక్కరాయసముంద్రంలో గురువారం నిర్వహించనున్న ప్రజాగళం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేనా, బీజేపీ పార్టీ నాయకులు భారీ సంఖ్యలో తరలిరావాలన్నారు.

శింగనమల : బుక్కరాయసముద్రంలో గురువారం చంద్రబాబు నిర్వహించే ప్రజాగళాన్ని టీడీపీ శ్రేణులు జయప్రదం చేయాలని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఒక ప్రకటనలో కోరారు.

వైసీపీకి ఇవే చివరి రోజులు..!

అందుకే టీడీపీలోకి భారీగా వలసలు : మాజీ మంత్రి పరిటాల సునీత

అనంతపురంరూరల్, మార్చి 27: రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చివరి రోజులు నడుస్తున్నాయని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. బుధవారం అరవిందనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో రాప్తాడు నియోజవకర్గం పరిధిలోని అనంతపురం రూరల్ మండలం కొడిమి, సిండికేట్ నగర్, రామగిరి మండల కుంటిమద్ది, చెన్నెకొత్తపల్లి మండలం నాగసముద్రం ప్రాంతాల నుంచి 30 కుటుంబాలు వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. వారికి మాజీ మంత్రి పరిటాల సునీత కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సోదరుల వల్ల ఆ పార్టీ నాయకులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకే గతంలో ఎప్పుడూ లేనివిధంగా చేరికలు కొనసాగుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో ఆపార్టీ ఖాళీ అవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, ఎంపిటీసీ క్రిష్ణరెడ్డి, మంజునాథ్, నాగరాజు, అల్లీపీరా, రాజేష్, బుల్లెట్ రఫీ, ఆంజనేయులు, లింగారెడ్డి, నారాయణప్ప, ఎల్లప్ప, నారాయణ స్వామి,సూరి, డొక్కా నాగార్జున, ఉజ్జినప్ప, వన్నూరుస్వామి, నాగేంద్ర, రామకృష్ణ, విజయ్ పాల్గొన్నారు.



పరిటాల సునీత సమక్షంలో టీడీపీలో చేరిన సిండికేట్ నగర్ వైసీపీ శ్రేణులు



సభావేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు నాని, కాలవ శ్రీనివాసులు, బండారు శ్రావణి

నేటి చంద్రబాబు పర్యటన విజయవంతం చేయండి

బుక్కరాయసముద్రం, మార్చి 27: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు నాయుడు గురువారం నిర్వహించే ప్రజాగళం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ జోనల్-5 జోనల్ ఇన్‌చార్జి నాని పిలుపునిచ్చారు. బుధవారం బుక్కరాయసముద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద నిర్వహించే రోడ్డుషో, బహిరంగ సభా సమావేశం నిర్వహించే కూడలిని ఆయన జిల్లా టీడీపీ అధ్యక్షుడు కాలువ శ్రీనివాసులు, ప్రజాగళం కో-ఆర్డినేటర్ రాజశేఖర్‌బాబు, శింగనమల నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణీశ్రీలతో కలిసి పరిశీలించారు. అంతకుముందు బాబు పర్యటనపై శింగనమల ముఖ్యనేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలు నుంచి ప్రజాగళం సభకు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. గురువారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సభా కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ ఉపాధ్యాక్షుడు పసుపుల హనుమంతురెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబులు, నాయకులు కన్వీనర్ అశోక్, లక్ష్మినారాయణ ఎస్‌నారాయణస్వామి, కేశన్న, ఎస్‌కే వెంకటేశులు, రవీంద్రా, సీపీఎస్ఎస్, పటేల్‌భూషి, హరి పాల్గొన్నారు.

ఎన్నికల సమరానికి సిద్ధంకండి : వైకుంఠం

అనంతపురం అర్బన్, మార్చి 27: రాబోవు సార్వత్రిక ఎన్నికల సమరానికి అందరూ సిద్ధం కావాలని, గెలుపే లక్ష్యంగా సమష్టిగా పోరాడుదామని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పిలుపునిచ్చారు. స్థానిక రాయల్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన అనంతపురం అర్బన్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక నుంచి 40 రోజులపాటు నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లోనే ఉండాలన్నారు. వైసీపీ పాలనలో అనేక కష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొని ఆత్మస్థైర్యంలో ముందుకు వెళ్లామన్నారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి పనులపై మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. తనను నమ్ముకున్న వారికి ఏనాడు ద్రోహం చేయలేదని, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత వారి ఇంట్లో వాడిననే భావన కలిస్తానని అన్నారు. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం తనకు ఇది ఏడో సారి అని, మంచి మెజార్టీతో గెలవడంతోపాటు పార్లమెంట్ స్థానాన్ని గెలిపించేలా కృషి చేయాలని అన్నారు. 2019 ఎన్నికల్లో చిన్న చిన్న పొరపాట్లు జరిగాయని, ప్రస్తుతం వాటిని సరిచేసుకొని పనిచేయాలని అన్నారు. అనంత అర్బన్ సీటు తనదే.. గెలుపు తనదేనని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, నాయకులు తలారి ఆదినారాయణ, సాలార్ బాషా, దేవళ్ల మురళీ, గాజుల ఆదెన్న, డిష్ నాగరాజు, సరిపూటి రమణ, మారుతీ కుమార్ గౌడ్, నటేష్ చౌదరి, తెలుగు మహిళలు స్వప్న, విజయశ్రీరెడ్డి, సంగా తేజస్విని, సరళ, జానకి, కృష్ణవేణి, హసీనా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్ చౌదరి

కోడ్‌ను కట్టుదిట్టంగా అమలు చేయండి

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా

అనంతపురం టౌన్, మార్చి 27: ఎన్నికల కోడ్‌ను ఎక్కడా నిర్లక్ష్యం చేయకుండా కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. అనుమతుల మేరకు ఎప్పటి నుంచో ఉన్న రాజకీయ ప్రకటనల హోర్డింగ్‌లు తొలగించవద్దన్నారు. పార్టీలు నిర్వహించే కార్యక్రమాలకు 48 గంటల ముందుగా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితులలో ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో కూడా దరకాస్తు అందించి అనుమతి పొందవచ్చన్నారు. ఇంటింటికి ప్రచారానికి కూడా ముందస్తు అనుమతి తీసుకోవాలనే నిబంధనపై రాజకీయ పార్టీల నుంచి అభ్యంతరాలు వచ్చాయని కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని, దీనిపై త్వరలోనే సరైన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఓటర్ల తొలగింపు ఫారాల పెండింగ్‌లను పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ నిబంధనలు అమలు చేయడం కోసం నియమించిన కమిటీ బృందాల తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. అందరూ సమష్టిగా కలిసి పనిచేయాలని, అపుడే ఎన్నికలు సజావుగా జరుగుతాయని సూచించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టరు గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, జడ్పీ సీఈఓ వైఖోల్ నిదియా, నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్ పాల్గొన్నారు.

పాత నేరస్తులపై దృష్టి సారించండి

అనంతపురం క్రైం: రానున్న ఎన్నికల నేపథ్యంలో పాత నేరసులపై నిఘా పెంచాలని సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. బుధవారం నగరంలోని సెబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. అంతర్రాష్ట్ర మద్యం, నాటుసారా, బెల్ట్‌షాపులపై దాడులు విస్తృతం చేయాలన్నారు. పాత నేరస్తులందరిపై బైండ్ ఓవర్ చేయాలని సూచించారు.

ముగ్గురి అరెస్ట్ : స్థానిక సాయినగర్ 8వ క్రాస్‌కు చెందిన ఓ వ్యక్తి మట్కా నిర్వహిస్తుండగా నగర టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అతని నుంచి రూ.10,400 స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఐదో రోడ్డుకు చెందిన ఓ మహిళ స్థానిక మద్యం విక్రయిస్తుండగా త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె నుంచి తొమ్మిది బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

ఆత్మకూరు : స్థానిక ముస్లింలకు టీడీపీ యువనాయకుడు సుబ్బర హరి బుధవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ, మండల కన్వీనర్ శ్రీనివాసులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

టీడీపీ కూటమినే గెలిపించాలి

అనంతపురం సెంట్రల్, మార్చి 27: దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ పోరాటం సాకారం కావాలంటే టీడీపీ కూటమినే గెలిపించాలని ఎంఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు నరేంద్రబాబు పిలుపునిచ్చారు. బుధవారం ఉపాధ్యాయ భవన్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో వారు మాట్లాడుతూ... ఎస్సీలంటే గిట్టని జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఎస్సీ కార్పొరేషన్ నిధులతో జేబులు నింపుకుని నిర్వీర్యం చేశారని ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. దాదాపు 40 రకాల ఎస్సీ సంక్షేమ పథకాలను రద్దుచేసి నవరత్నాలతోనే సరిపెట్టారన్నారు. ఎస్సీల సంక్షేమానికి కేటాయించిన, మంజూరు చేసిన నిధులు ఎక్కడికెళ్లాయని నిలదీశారు. వైసీపీకి ఓట్లు వేస్తే భవిష్యత్తును నాశనం చేసుకున్నట్లేనని హెచ్చరించారు. భవిష్యత్ ప్రణాళికపై 30న గుంటూరులో నిర్వహించే రాష్ట్ర మహాసభకు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కేబీ మధు, శంకర్, అమర్నాథ్, గంగాధర్, బీసీఆర్ దాస్, ఆదినారాయణ, పెద్దిరాజు, ఆనంద్, చంద్రశేఖర్, బాణాసి శీను, రేఖలకుంట రామాంజినేయులు, భూపతి పాల్గొన్నారు.

గ్రామీణ స్థాయిలో డిజిటల్ లావాదేవీలు

అనంతపురం సెంట్రల్, మార్చి 27: గ్రామీణ స్థాయిలో డిజిటిల్ లావాదేవీల ప్రక్రియను తీసుకెళ్లాలని గుల్బర్గా యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజనాల్కర్ పేర్కొన్నారు. బుధవారం ఎస్కేయూ వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'నగదు రహిత ఆర్థిక వ్యవస్థ- పోకడలు, అంశాలు' అనే అంశంపై జాతీయ సదస్సును నిర్వహించారు. ఐసీఎస్ఎస్ఆర్ సౌజన్యంతో పూలేభవన్‌లో నిర్వహించిన సదస్సుకు రానాల్కర్‌తో పాటు ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలలో నగదరు రహిత లావాదేవీలపై అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఆంజనేయులు, బెంగళూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ నారాయణప్ప, నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ శివరామ్‌ప్రసాద్, ఎస్కేయూ ప్రిన్సిపాల్ క్రిష్ణకుమారి, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం

అనంతపురంరూరల్ : రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.60 వేల కోట్లను సీఎం జగన్‌రెడ్డి పక్కదారి పట్టించారని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బీసీఆర్ దాస్ అన్నారు. ఈనెల 30న గుంటూరులో జరిగే సభపై రాప్తాడు నియోజకవర్గం నాయకులతో బుధవారం కురుగుంటలోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు సంబంధించిన 27 సంక్షేమ పథకాలు రద్దు చేశారని, దళిత గిరిజన ఉద్యోగులను చంపించారని అన్నారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ అమర్ , సీఎం నరసింహులు, కుమారి, శ్రీరాములు, ఆది, శివ, సుబ్రమణ్యం, నాగేంద్ర పాల్గొన్నారు.

వైసీపీ కార్పొరేటర్ల విమర్శలు హాస్యాస్పదం



గౌస్‌మొద్దీన్

అనంతపురం అర్బన్, మార్చి 27 : నగర ప్రజల తాగునీటి సమస్య తీర్చలేని వైసీపీ కార్పొరేటర్లు టీడీపీపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తన క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో నమ్మి ఓట్లేసిన ప్రజలను వైసీపీ నట్టేట ముంచిందన్నారు. టీడీపీ హయాంలో గ్రంథాలయ సంస్థను నెంబర్ వన్‌గా తీర్చిదిద్దామన్నారు. చంద్ర బాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథకంలో నడిచిందన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు తప్పా ఒరిగిదేమి లేదన్నారు. ఎక్కడ చూసిన అరాచకాలు, భూకబ్జాలతో వైసీపీ నాయకులు పెట్రేగిపోతున్నారన్నారు. సాక్షాత్తు సీఎం జగన్ సొంత జిల్లాలోనే వైసీపీ నాయకుడి భూదాహానికి ఒక కుటుంబం బలైందని మండిపడ్డారు. రాబోవు ఎన్నికల్లో ఓటుతో వైసీపీకి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

తాగునీటి ఎద్దడి రానివ్వకండి : డీపీఓ

అనంతపురం న్యూటౌన్, మార్చి 27: జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి ఆదేశించినట్లు డీపీఓ ప్రభాకర్‌రావు తెలిపారు. బుధవారం డీపీఓ కార్యాలయంలోని తమ చాంబర్‌లో ఆయన మాట్లాడారు. తాగునీటి సమస్యలపై మరో రెండు రోజుల్లో సంబంధిత సెక్రటరీలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. జూన్, జూలై వరకు 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకొని ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకా రూ.39 కోట్లు రావాల్సి ఉంది. వాటి ద్వారా ఎక్కడైన మోటర్లు రిపేరీ చేయించడం, అవసరం ఉన్న చోట బోర్లు వేయించడం, మరో మార్గం లేదంటే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. నీటి ఎద్దడి నివారణకు మండల, పంచాయతీ నిధులతో పాటు, ఆర్‌డబ్ల్యూఎస్, జిల్లా పరిషత్ ద్వారా కూడా నిధులు వినియోగించుకుంటామన్నారు.

గడ్డివామి దగ్ధం

గార్లదిన్నె, మార్చి 27: మండలంలోని మర్తాడు గ్రామ రైతు లీలమ్మకు చెందిన వరిగడ్డి వామికి బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో సుమారు రూ. 20వేలు నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రికి ఫ్యాన్ల వితరణ

అనంతపురం కల్చరల్/టౌన్, మార్చి 27 : జిల్లా ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన బాలింతల వార్డుకు అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి ఫెడెస్టల్ ఫ్యాన్లను వితరణ చేశారు. రూ.40వేలు విలువ చేసే 12 ఫెడెస్టల్ ఫ్యాన్లను ఆయన బుధవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకు అందజేశారు.

బాబు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం



భాగ్యనగర్‌లో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురంరూరల్, మార్చి 27: పాపంపేట పంచాయతీ భాగ్యనగర్‌లో బాబు సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ శ్రేణులు బుధవారం ప్రచారం నిర్వహించారు. ఇందులో మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, గ్రామ కమిటీ అధ్య క్షుడు జెట్టి భరత్, నాయకులు రామాంజినేయులు, పేరంహరి, బాబుప్రసాద్, బాబావలి, రత్నమోహన్, ఆది, వెంకటరాముడు, మౌలా, రాము, నాయుడు, ఎర్రినాగప్ప, పోతులయ్య, హరీష్‌రెడ్డి, సాలమ్మ, రామాంజినమ్మ, శ్వేత పాల్గొన్నారు.

ఆర్డీటీ లావాదేవీలను రెన్యువల్ చేయాలి

అనంతపురం సెంట్రల్, మార్చి 27: ఆర్డీడీ సంస్థకు ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్ఏ) రెన్యువల్ చేయాలని కలెక్టరేట్ వద్దనున్న పాదర్ ఫెర్రర్ విగ్రహం వద్ద పలువురు లబ్ధిదారులు బుధవారం నిరసన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్డీటీ సంస్థకు నిధులు రాకుండా స్తంభింపచేస్తే నిరుపేదల బతుకులను బుగ్గిపాలు చేయడమేనన్నారు. ప్రభుత్వాలకన్నా మెరుగైన సేవలందిస్తున్న ఆర్డీటీ సంస్థ ద్వారా లక్షలాదిమంది నిరుపేదల సొంత ఇల్లు కల సాకారమైందన్నారు. అదేవిధంగా ఉచిత వైద్య, విద్యను పొంది స్వంతంగా బతగ గలుతున్నారన్నారు. అలాంటి సంస్థను నిర్వీర్యం చేయాలని చూస్తే ప్రభుత్వాలపై తిరగబడాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీటీ సంస్థ ద్వారా లబ్ధిపొందిన రామకృష్ణ, వరలక్ష్మి, సుబ్రమణ్యం, మలరాయుడు, నాగేంద్ర, నరసింహులు, ఆంజనేయులు, మున్నా, నాగరాజు, వెంకటలక్ష్మి, శారద, జయమ్మ, స్నేహలత, ఎర్రిస్వామి, రామాంజి పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

అనంతపురం కల్చరల్ : మాదక ద్రవ్యాల సరఫరాకు పాల్పడే దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం ఐద్వా జిల్లా కార్యాలయంలో సావిత్రి మాట్లాడుతూ... పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల కు మాదక ద్రవ్యాలు అందుతున్నాయంటే ఈ రాష్ట్రంలోని దౌర్భాగ్య పరిస్థితిని అర్థం చేసుకోవచ్చునన్నారు. మాదక ద్రవ్యాల నిషేధంలో రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, వీటిని కట్టడి చేయాలని కోరారు. వారం రోజుల క్రితం విశాఖపట్నంలో రూ.కోట్లు విలువచేసే క్రొకైన్ దొరికిన విషయం విదితమేనని, దీనిపై సీబీఐ సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకురాలు సాయిలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు శ్యామల, నాయకురాళ్లు జ్యోతి, రామానుజులమ్మ, రేణుక, గీత, రేవతి పాల్గొన్నారు.



జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 27: జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు రాష్ట్ర బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పది రోజుల నుంచి స్థానిక ఆర్డీటీ అనంత క్రీడాగ్రామంలో రాష్ట్ర సబ్ జూనియర్ బాల, బాలికల జట్ల క్రీడాకారుల ఇస్తున్న శిక్షణ బుధవారంతో ముగిసింది. జాతీయ పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారుల వివరాలను ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు ప్రకటించారు. బాలుర జట్టులో.. నానిబాబు, రోహిత్, జ్యోతి ప్రకాష్, జనార్ధన్ (విజయనగరం జిల్లా), కుష్యంత్ (కృష్ణా జిల్లా), కార్తీక్, పార్థసారథి (గుంటూరు), శశి, మురళీ (అనంతపురం), వంశీ (చిత్తూరు), జగన్ (కర్నూలు), పవన్ (శ్రీకాకుళం), ధీరజ్ (నెల్లూరు), చరణ్‌తేజ (ప్రకాశం), బద్రినాథ్ (కడప), సాత్విక్ (కర్నూలు), మనోజ్ (విశాఖపట్నం), వీరబాబు (తూర్పుగోదావరి) చోటు సాధించారు. అలాగే బాలికల జట్టులో.. దేవిప్రియ (శ్రీకాకుళం), చైతన్య, తేజస్వని, భువనేశ్వరి (విజయనగరం), తిరుమల (గుంటూరు), దీవెన, వాసంతి (ప్రకాశం), సానియా, భాగ్యలక్ష్మి (అనంతపురం), ఉమ, హిందూ, హేమలత (చిత్తూరు), పూర్ణిమ (తూర్పుగోదావరి), వినయ, సన్నీ (కడప), కృత్తిక (కర్నూలు) ఎంపికయ్యారు. ఈనెల 28 నుంచి మహారాష్ట్రలోని ఔరంగబాద్‌లో నిర్వహించే జాతీయ స్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో వీరు పాల్గొంటారు. ఎంపికైన క్రీడాకారులకు ఇటుకలపల్లి సీఐ నరేంద్రరెడ్డి దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్ర, ఆర్డీటీ గ్రాస్‌రూట్ కో-ఆర్డినేటర్ వంశీకృష్ణ, పీడీలు గోపాల్‌రెడ్డి, రమేష్, చంద్ర, లతాదేవి, కోచ్‌లు బద్రి, మహేష్, సింహాద్రి, లక్ష్మినారాయణ, వరుణ్, లక్ష్మి పాల్గొన్నారు.



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

వైభవంగా ఎర్రిస్వామి రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

ఉరవకొండ, మార్చి 27: మండలంలోని వై.రాంపురం గ్రామంలో ఎర్రిస్వామి రథోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలను చేశారు. అనంతరం సాయంత్రం ఉత్సవ మూర్తులను రథంపై అధిష్టింపజేశారు. రథాన్ని ఆలయం నుంచి బొడ్రాయి వరకు లాగారు. రథంపైకి భక్తులు అరటిపండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. రథాన్ని తిరిగి యథాస్థానానికి చేర్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్త్ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఉరవకొండ, మార్చి 27: పట్టణంలోని పాతపేటలోని 8వ వార్డులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు ఖాళీబిందెలతో నిరసన వ్యక్తం చేశారు. నెలరోజులుగా నీరు రావడం లేదన్నారు. తాగునీటి సరఫరా చేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కనీసం తాగడానికి కూడా నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. పక్క వీధుల్లోకి వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

కేంద్ర బలగాల కవాతు


పట్టణంలో బీఎస్ఎఫ్ బలగాలు, పోలీసుల కవాతు

బొమ్మనహళ్, మార్చి 27: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా, శాంతియుతంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు వారికి భరోసా కల్పిస్తూ సీఆర్‌పీఎఫ్ బలగాలతో కలిసి కవాతు నిర్వహించినట్లు కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని ఉద్దేహళ్, దర్గాహోన్నూరు, గోవిందవాడ, బొమ్మనహళ్ గ్రామాలలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. రాయదుర్గం రూరల్ సీఐ ప్రసాద్, ఎస్ఐలు శ్రీనివాసులు, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశులు, సిబ్బంది పాల్గొన్నారు. .

మహిళ ఆత్మహత్య

గుంతకల్లుటౌన్, మార్చి 27: మండలంలోని తిమ్మాపురం గ్రామానికి బీ ప్రియాంక(28) అనే మహిళ ఉరివేసుకుని బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని సత్యనారాయణ పేటకు చెందిన సతీష్‌కుమార్‌కు తిమ్మాపురం గ్రామానికి చెందిన ప్రియాంకకు ఐదు సంవత్సరాల క్రితం వివాహమైందన్నారు. కాన్పు కోసం ప్రియాంక తిమ్మాపురంలోని పుట్టింటికి వచ్చిందన్నారు. సతీష్‌కుమార్ పట్టణంలోని 60 అడుగుల రోడ్డులో గతంలో టీ దుకాణం పెట్టుకున్నాడని, ప్రస్తుతం మద్యానికి బానిసై భార్యతో డబ్బు విషయమై తరచూ గొడవ పడేవాడన్నారు. దీంతో మనస్థాపం చెందిన ప్రియాంక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఐదు నెలల బాబును బయట పెట్టి గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుందన్నారు. ఇంటికి వచ్చిన ఆమె తల్లి నాగలక్ష్మి గమనించి తలుపు కొట్టగా ఆమె తెరవకపోవడంతో అనుమానం వచ్చి తలుపుల పగలగొట్టి లోపలికి వెళ్లారు. ప్రియాంకను కిందకు దింపగా అప్పటికే మృతి చెందిందన్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అడవి పందిని ఢీకొని ముగ్గురికి గాయాలు

పెద్దవడుగూరు, మార్చి 27: మండలంలోని లక్షుంపల్లి గ్రామసమీపంలో బుధవారం ద్విచక్రవాహనాన్ని అడవిపంది ఢీకొన్న సంఘటనలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలమేరకు పెద్దవడుగూరు మండలం కదరగుట్టపల్లి గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి, పుట్లూరు మండలం వెంగన్నపల్లి గ్రామానికి చెందిన నారాయణరెడ్డి, ప్రకాష్‌రెడ్డి ద్విచక్రవాహనంలో పెద్దవడుగూరులో ఓ వివాహ కార్యక్రమానికి బయలుదేరారు. లక్షుంపల్లి గ్రామసమీపంలోకి రాగానే అకస్మాత్తుగా అడవిపంది అడ్డు రావడంతో వారు కిందపడి గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు.

నాటుసారా సీజ్

యాడికి, మార్చి 27: సారా తయారుచేసి విక్రయిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసి 15లీటర్ల నాటుసారా సీజ్‌చేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. నిట్టూరు గ్రామానికి చెందిన నల్లబోతుల రమేష్ సారా తయారుచేసి విక్రయిస్తుంటాడని తెలిపారు. బుధవారం నిట్టూరు గ్రామ సమీపాన సారా విక్రయిస్తుండగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

తాడిపత్రిటౌన్, మార్చి 27: పట్టణ సమీపంలోని యల్లనూరురోడ్డు బైపాస్‌లో బుధవారం యల్లనూరు మండలకేంద్రానికి చెందిన జిలానీ వద్ద నుంచి 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ ఫణీంద్ర తెలిపారు. జిలాని అనే వ్యక్తి మద్యం బాటిళ్లను అక్రమంగా నిల్వ ఉంచి విక్రయాలు జరుపుతున్నాడన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి నిందితుడిని అరెస్ట్‌చేసి కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

గడ్డివామికి నిప్పు


గుంతకల్లుటౌన్, మార్చి 27: మండలంలోని ఓబుళాపురం గ్రామంలో సుంకిరెడ్డికి చెందిన గడ్డివామికి బుధవారం అదే గ్రామానికి చెందిన గురుప్రసాద్, సుధాకర్ అనే వ్యక్తులు నిప్పుపెట్టారని కసాపురం పోలీసులు తెలిపారు. సుంకిరెడ్డి గ్రామ సమీపంలో గడ్డివామి వేశాడన్నారు. వామికి గురుప్రసాద్, సుధాకర్‌లు నిప్పుపెట్టారని గమనించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

దాడి కేసులో ఐదుగురి అరెస్టు

యాడికి, మార్చి 27: మండలంలోని భోగాలకట్ట గ్రామంలో దూదేకుల బాబయ్య అనే వ్యక్తిపై దాడిచేసిన సంఘటనలో బుధవారం ఐదుగురిని అరెస్టుచేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. గ్రామంలో మనస్పర్థల కారణంగా 3వ తేదీన బాబయ్యపై అదే గ్రామానికి చెందిన ప్రతాప్, శివక్రిష్ణ, విశ్వనాథ్, నాగవేణి, మల్లేశ్వరి దాడిచేసి గాయపరిచారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదు చేశామన్నారు. దర్యాప్తులో భాగంగా బుధవారం ఐదుగురిని అరెస్ట్‌చేసినట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

పుట్లూరు, మార్చి 27: మండలంలోని సూరేపల్లి గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా అనే వ్యక్తి అదృశ్యమైనట్లు బుధవారం ఎస్ఐ హేమాద్రి తెలిపారు. ఈనెల 15న తాడిపత్రికి వెళుతున్నానని చెప్పి తిరిగి రాలేదని భార్య రమీజా ఫిర్యాదు చేసిందన్నారు. బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేదన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


మహబూబ్‌బాషా (ఫైల్)

టీడీపీ గెలుపు.. ప్రగతికి పిలుపు: అమిలినేని


సురేంద్రబాబుకు హారతి పడుతున్న మహిళలు

కళ్యాణదుర్గం, మార్చి 27: నియోజకవర్గంలో టీడీపీని గెలిపిస్తే పల్లెలన్నీ ప్రగతిపథంలో అభివృద్ధి దిశగా పయనిస్తాయని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు అన్నారు. బుధవారం శెట్టూరు మండల మాకొడికి, కరిడిపల్లి గ్రామాల్లో ఆయన పెద్దఎత్తున రోడ్ షో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు, తాగునీరు అందించి అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. నియోజకవర్గానికి తాగు, సాగు నీరు అందిస్తూ రైతుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో రోడ్లు చాలా అధ్వానంగా వున్నాయని, కనీసం గుంతలు కూడా పూడ్చకుండా వదిలేశారని, అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లు బాగుచేస్తామన్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా మురుగునీరు దర్శనమిస్తున్నాయని, అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి చేస్తామన్నారు. పల్లెలను అభివృద్ధి పథంలో నడిపించాలంటే టీడీపీతోనే సాధ్యమవుతుందన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్కరు టీడీపీని ఆదరించాలన్నారు. అమిలినేని ప్రచారానికి ఎక్కడ చూసినా అపూర్వ ఆదరణ లభిస్తోంది. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అభివృద్ధే టీడీపీ నినాదం: అశ్మిత్ రెడ్డి


వృద్ధురాలికి నమస్కరిస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి 27: అభివృద్ధే తెలుగుదేశంపార్టీ నినాదమని ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కాలనీలో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో జేసీ అశ్మిత్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనతోనే రాష్ట్రం సుభిక్షం

ఉరవకొండ: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే చంద్రబాబు పాలనతోనే సాధ్యమని ఎమ్మెల్యే తనయుడు విజయ్‌సింహ అన్నారు. వజ్రకరూరు మండలంలోని పెద్దహోతూరులో బుధవారం బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై ఓటర్లలో అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్‌కు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, టీడీపీ నాయకులు నాగేంద్ర, వన్నూర్‌స్వామి, మండి ఎర్రిస్వామి, ఈశ్వరయ్య, సుంకన్న, నీలప్ప పాల్గొన్నారు. అనంతరం ఉండబండలో ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. మండల కన్వీనర్ బీడీ చిన్న మారయ్య, నాయకులు భీమలింగప్ప, నారాయణస్వామి, వన్నూరుస్వామి, ఓబులేశు, నాగేంద్ర పాల్గొన్నారు.

వైసీపీకి ఓటు వేస్తే రాష్ట్రం అంధకారమే

బొమ్మనహాళ్: వైసీపీకి మరోసారి ఓటు వేస్తే రాష్ట్రం అంధకారమేనని టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలను ఆయ వివరించారు. వైసీపీ మాయమాటలను నమ్మి ఓటు వేస్తే రాష్ట్రం సర్వనాశనం అవుతుందన్నారు. కాలవ శ్రీనివాసులు ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిస్తే చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారన్నారు. ఉంతకల్లు వద్ద రిజర్వాయర్ నిర్మాణం జరిగి పంటలు సమృద్ధిగా పండుతాయని అన్నారు. మాజీ ఎంపీటీసీలు తిప్పేస్వామి, కృష్ణ, కే సోమప్ప, మల్లికార్జున, ఎర్రిస్వామి, సిద్ధరామ పాల్గొన్నారు.


శ్రీధరఘట్టలో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి

● ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు


ప్రచారం నిర్వహిస్తున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, మార్చి 27: తెలుగుదేశం పార్టీని గెలిపించి అధికారంలోకి తీసుకొస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని 15వ వార్డులో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్రాన్ని జగన్ అన్ని విధాలా భ్రష్టుపట్టించాడని విమర్శించారు. అన్ని రంగాలను, వ్యవస్థలను నాశనం చేశాడన్నారు. భావి తరాలకు ఉజ్వల భవిష్యత్తు అందించడానికి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవడమే ఏకైక మార్గమని తెలిపారు. ఆయనతో పాటు జనసేన ఇన్‌చార్జి కరేగౌడ్ర మంజునాథ, వార్డు ఇన్‌చార్జి కొండాపురం శ్రీనివాసులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతోనే పేదల అభివృద్ధి


కరపత్రాలు పంచుతున్న రాహుల్

బ్రహ్మసముద్రం, మార్చి 27 : సూపర్‌సిక్స్ పథకాలతోనే పేదల అభివృసాధ్యమని టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అల్లుడు రాహుల్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కన్నేపల్లి, ముద్దలాపురం గ్రామాలలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాల ద్వారా లబ్ధి ప్రతి ఒక్కరికి చేకూరుతుందన్నారు. కరపత్రాలను పంచుతూ సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పాలబండ్ల శ్రీరాములు, మాజీ మండల కన్వీనర్ రాజశేఖర్‌గౌడ్, మండల టీడీపీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి 35 వైసీపీ కుటుంబాల చేరిక


టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అమిలినేని సురేంద్రబాబు


టీడీపీలో చేరిన కొత్తపల్లి దళితులు


కళ్యాణదుర్గం, మార్చి 27: నియోజకవర్గంలో టీడీపీలోకి వలసలు ఊపందుకున్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో బుధవారం 35 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. బ్రహ్మసముద్రం మండలం పిల్లలపల్లికి చెందిన వైసీపీ కుటుంబాలకు పార్టీ కండువావేసి సురేంద్రబాబు ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గం కంచుకోటలో టీడీపీ గెలుపునకు అహర్నిశలు శ్రమించాలని సూచించారు. ఈ రోజు ఎక్కడ చూసినా టీడీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అభివృద్ధి బాటలో గ్రామాలన్నీ నడవాలన్నా, భావితరాల భవిష్యత్తు బాగుపడాలన్నా ఒక్క టీడీపీతోనే సాధ్యమన్నారు. ఏ గ్రామంలో చూసినా టీడీపీకి ఆదరణ అనూహ్యంగా లభిస్తోందన్నారు. ఆ ఆదరణతోనే అత్యధిక మెజార్టీతో విజయకేతనం ఎగురవేస్తామన్నారు. బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి కొత్తపల్లి దళితుల చేరిక

కణేకల్లు: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన 12 దళిత కుటుంబాలు బుధవారం మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలోకి చేరారు. మేస్త్రి రామాంజి, గంగాధర, సురేష్, వంశీ, విజయ్‌కుమార్, సురేంద్ర, అనిల్, వన్నూరుస్వామి, సుమంత్, వండ్రప్ప, నాగరాజు, కరెన్న తదితరులు వైసీపీని వీడి టీడీపీలోకి చేరగా మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కాలవ మాట్లాడుతూ టీడీపీలోనే దళితులకు సరైన న్యాయం చేకూరుతుందన్న నమ్మకంతో పార్టీలోకి చేరుతున్నారన్నారు. నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, ఆది, కోకుర్తి సుదర్శన్, టీటీ రమేష్, చాంద్‌బాషా, కురుబ నాగరాజు, మాబుసాబ్, చిన్న సలీమ్, ఈరప్ప, ప్రభాకర్, గోపాల్‌రెడ్డి, ఫకృద్దీన్, కొత్తపల్లి వన్నారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరిక

తాడిపత్రిటౌన్: స్థానిక నివాసంలో టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి సమక్షంలో పట్టణంలోని 10, 11 వార్డులకు చెందిన వైసీపీ కౌన్సిలర్లు ఫైజున్, హేమావతి, మాజీ కౌన్సిలర్ వరదయ్యతోపాటు మరో 120మంది బుధవారం టీడీపీలో చేరారు. వారికి జేసీ అశ్మిత్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అభివృద్ధి కావాలంటే టీడీపీతోనే సాధ్యమని నమ్మి పార్టీలోకి చేరినట్లు వారు తెలిపారు.


తాడిపత్రి: పార్టీలో చేరిన వారితో జేసీపీఆర్, జేసీ అశ్మిత్‌రెడ్డి

టీడీపీలోకి భారీగా చేరికలు

కళ్యాణదుర్గం: టీడీపీలోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. బుధవారం కంబదూరు మండల పీ చెర్లోపల్లిలో తొమ్మిది వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్ చౌదరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ గాజుల శ్రీరాములు, క్లస్టర్ ఇన్‌చార్జి ములకనూరు తిమ్మరాయుడు పార్టీలోకి చేరిన వారిని కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. మిద్దె నెట్టికల్లప్పకు చెందిన నాలుగు కుటుంబాలు, రామాంజనేయులుకు చెందిన మూడు కుటుంబాలు, కాసయ్యకు చెందిన రెండు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు.


పార్టీ కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న రామ్మోహన్ చౌదరి, లక్ష్మీ నారాయణ

తొండపాడు ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

గుత్తిరూరల్, మార్చి 27: మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథస్వామి దేవాలయంలో బుధవారం ఈఓలు కే.రాణి నాగేంద్రుడు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు. గత ఏడాది సెప్టెంబరు నుంచి ఇప్పటి వరకు భక్తులు హుండీలో వేసిన విరాళాలను లెక్కించారు. ఈ సందర్భంగా రూ.15,72,883 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు.గుంతకల్లు హనుమాన్ సేవా సమితి సభ్యులు, ఆలయ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండ: పట్టణంలోని గవిమఠంలో భక్తులు స్వామి వారికి సమర్పించిన హుండీ ఆదాయన్ని బుధవారం లెక్కించారు. స్థానిక గవిమఠం ఆవరణలో కమిషనర్ చిట్టెమ్మ సమక్షంలో లెక్కింపు చేశారు. 182 రోజులకు సంబంధించి రూ.1,00,907 ఆదాయం వచ్చినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో గవిమఠం సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల బెడద నివారించాలని వినతి

గుంతకల్లుటౌన్, మార్చి 27: పట్టణంలో వీధి కుక్కల బెడద నివారించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు బుధవారం సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ పట్టణంలో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నాయని, కాలనీల్లో, రోడ్ల మీదకు రావాలంటే పిల్లలు, మహిళలు భయపడుతున్నారన్నారు. స్కూటర్‌పై వెళ్తున్న వారి మీద కుక్కలు కరవడానికి వెళ్తున్నాయని వాటి నుంచి తప్పించుకోవడానికి వాహనదారులు కింద పడి గాయపడుతున్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బీ శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు మారుతిప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, వై రమేష్ పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలి

గుంతకల్లుటౌన్, మార్చి 27: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ మాదిగ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. తెలుగు రాష్ట్రాలలో నిరుపేదలకు విద్య, వైద్యం, క్రీడా రంగంలో 50 సంవత్సరాలుగా సంస్థ ఉచితంగా సేవలందిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి రెన్యువల్ చేయకపోతే వచ్చే ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎన్నికల ప్రచారానికి అనుమతి తప్పనిసరి

రాయదుర్గంరూరల్, మార్చి 27: ఎన్నికల్లో ప్రచారం నిర్వహించేందుకు అభ్యర్థులు ఎన్నికల కమిషన్ ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తహసీల్దార్ చిట్టిబాబు సూచించారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారులు రాజకీయ పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో నిబంధనలకు లోబడే నడుచుకోవాలని సూచించారు. ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణబాబు సీ విజిల్ యాప్‌పై పట్టణంలోని కూడలిలో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

గుత్తి, మార్చి 27: పట్టణ శివారులోని గేట్స్ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత పాలిసెట్ శిక్షణ ఇస్తునట్లు కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ బుధవారం తెలిపారు. 2024 ప్రవేశ పరీక్ష ద్వారా డిప్లొమా కోర్సులలో చేరాలనుకునే విద్యార్థులకు గేట్స్ కళాశాలలో ఏప్రిల్ 1నుంచి కోచింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు గుత్తి ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రతి రోజు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను 8333987201 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఎస్‌వీఎస్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీలో షార్ట్ టర్మ్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌వీఎస్ కళాశాల కరస్పాండెంట్ ఓంకారప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కొనకొండ్ల రోడ్డులోని ఎస్‌వీఎస్ కళాశాలలో ఏప్రిల్ 1 నుంచి ఉదయం 9 నుంచి 12 గంటల వరకు శిక్షణ తరగతులు జరగనున్నాయన్నారు. 24 సంవత్సర కాలంలో మా వద్ద శిక్షణ తీసుకున్న విద్యార్థులు టాప్ ర్యాంకర్స్‌గా నిలిచారన్నారు.మరిన్ని వివరాలకు సెల్: 9963876741,9440522877 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

చంద్రబాబు సభకు తరలిరండి

పుట్లూరు, మార్చి 27: బుక్కరాయసముద్రంలో గురువారం నిర్వహించే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సభకు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, మండల నాయకుడు చవ్వా కులశేఖర్‌రెడ్డి బుధవారం పిలుపునిచ్చారు. ఆయా గ్రామాల్లో నాయకులు కార్యకర్తలకు వాహనాలు అందుబాటులో ఉంచామని, ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

టీడీపీ అధికారంలోకి రావాలి

పెద్దపప్పూరు, మార్చి27: మాదిగలు అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు మల్లికార్జున అన్నారు. మండలంలోని ముచ్చుకోట గ్రామంలో బుధవారం నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ తీసుకున్న నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామన్నారు. కూటమిలో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో శ్రీరాములు, కిషోర్, తిరుపతి పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

పెద్దవడుగూరు, మార్చి27: ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని పెన్నానది పరివాహక ప్రాంతంలో అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ఇసుక అక్రమ రవాణా చేస్తే కేవలం అపరాధ రుసుం మాత్రమే విధించేవారన్నారు. ప్రస్తుతం వాహనాలను సీజ్‌చేసి కోర్టుకు అప్పగిస్తామని ఆయన తెలిపారు.

సరిహద్దు చెక్‌పోస్టుల తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న సెబ్ డిప్యూటీ కమిషనర్

ఉరవకొండ, మార్చి 27: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రా, కర్ణాటక సరిహద్దులోని చెక్‌పోస్టులను సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య బుధవారం తనిఖీ చేశారు. విడపనకల్లు మండలంలోని డొనేకల్లు, విడపనకల్లు చెక్‌పోస్టులను పరిశీలించారు. వాహనాలను తనిఖీ చేశారు. చెక్‌పోస్టులోని రికార్డులను పరిశీలించారు. అక్రమ మద్యం ఎట్టి పరిస్థితులలోనూ సరిహద్దులు దాటకూడదని సెబ్ అధికారులు సిబ్బందిని ఆదేశించారు. సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, ఉరవకొండ సెబ్ సీఐ కిషోర్ పాల్గొన్నారు.

మద్యం డంప్‌లపై దృష్టి సారించండి

కణేకల్లు: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో ఉన్న మద్యం డంప్‌లపై దృష్టి సారించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సూచించారు. శుక్రవారం ఆయన కణేకల్లులోని ఎక్సైజ్ కార్యాలయాన్ని తనిఖీ చేసి అక్కడి వారితో మాట్లాడారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిండెంట్ శ్రీరామ్‌తో పాటు సీఐ ప్రసాదరావు ఉన్నారు.

కార్మికులకు న్యాయం జరగడం లేదు


మాట్లాడుతున్న సీపీఐ పట్టణ కార్యదర్శి

తాడిపత్రిటౌన్, మార్చి 27: ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా కార్మికులకు న్యాయం జరగడం లేదని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ అన్నారు. పట్టణంలోని నెహ్రూపార్కులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల వెల్ఫేర్ బోర్డులో ఉన్న నిధులు కాజేయడం తప్ప వారికి న్యాయం జరిగింది లేదన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేయాలని చూస్తున్నారన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సంక్షేమ బోర్డు నిధులు దారి మళ్లించరాదని చెబుతున్నా పెడచెవిన పెడుతున్నారన్నారు. ఏఐటీయూసీ నాయకులు రమణ, శ్రీనివాసయాదవ్, రత్నమయ్య, రామాంజనేయులు, కుళ్లాయప్ప, సంజన పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

బొమ్మనహాళ్, మార్చి 27: మండలంలోని గోవిందవాడ పంచాయతీ కార్యదర్శి వన్నూరుస్వామి సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ విజయమ్మ విలేకరులకు తెలిపారు. కార్యదర్శి వన్నూరుస్వామి గత ఏడాది 26వ తేదీ నుంచి కనబడకుండా వెళ్లిపోయాడు. ఈ విషయం గతంలోనే జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపించామన్నారు. దీంతో కలెక్టర్ గౌతమి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

గుండెపోటుతో సబార్డినేటర్ మృతి


పురుషోత్తం(ఫైల్)

బొమ్మనహాళ్, మార్చి 27: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సబార్డినేటర్‌గా పనిచేస్తున్న పురుషోత్తం(45) గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. బొమ్మనహాళ్ ప్రభుత్వాసుపత్రిలో గత కొంత కాలంగా సబార్డినేటర్‌గా పనిచేస్తున్నాడు. రెండురోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురై బళ్లారి విమ్స్‌లో చికిత్స అందిస్తుండగా బుధవారం ఉదయం మృతి చెందినట్లు బంధువులు, ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. పురుషోత్తం మృతిపై ఆసుపత్రి సిబ్బంది పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు.

పది పరీక్ష కేంద్రాల తనిఖీ

కణేకల్లు, మార్చి 27: మండల కేంద్రంలో జరుగుతున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాలను డీఎస్పీ శ్రీనివాసులు తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏ విధంగా అమలు అవుతుందన్న విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలకు బుధవారం స్క్వాడ్ శ్రీదేవి ఆకస్మిక తనిఖీ చేసినట్లు మల్లారెడ్డి తెలిపారు. చివరి పరీక్షకు 49 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కంట్రోల్ రూం ఏర్పాటు

గుంతకల్లుటౌన్, మార్చి27: మున్సిపాలిటీ పరిధిలో నీటి సరఫరా సమస్యలు పరిష్కారానికి కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ వెంకటరమణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల ప్రజల విజ్ఞప్తులను స్వీకరించి సిబ్బంది ద్వారా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. పట్టణ ప్రజలు 08552226725, 9642912127 నెంబర్లను సంప్రదించాలన్నారు.